వృద్ధాప్యంలో ఆదుకోవలసిన తల్లిదండ్రుల్ని కొడుకులు నిరాదరిస్తే ఆ కూతురు చూపించిన ప్రేమ?

# మరణకిరణం

రాఘవరాజు పట్టాభిరామరాజు కథ

దొడ్లో చింతచెట్టుకింద ఒక పాత నులక మంచం. మంచంపైన మాసిపోయి చిరుగులు పడ్డ జంఖానం. నూనె మరకలతో నిండిన గలీబులేని దిండు. ఆ దిండుపైన తలపెట్టుకుని పడుకుని, శూన్యంలోకి చూస్తున్న ఓ అస్థిపంజరంలాంటి ఆకారం.

అది మే నెల. ఉదయం పదిగంటలయింది. అప్పటికే సూర్యుడు లోకంపై చండ్రనిప్పులు చెరుగుతున్నాడు. చింతకొమ్మల్లోనుండి సూర్యకిరణాలు పొడలుపొడలుగా మంచంమీద పడుతున్నాయి. చిటారు కొమ్మల్లో కూర్చున్న రెండు కాకులు అదే పనిగా కావ్ కావ్ మని కర్ణకఠోరంగా అరుస్తున్నాయి. అందులో ఒక కాకికి మనుషులు పెట్టినపేరు మాలకాకి. మామూలు కాకికి కంఠంవద్ద బూడిదరంగులో వుంటే, మాలకాకికి అక్కడకూడా నల్లగా వుంటుంది. అంతే తేడా.

ప్రకృతిలో స్వేచ్ఛగా విహరించే పక్షులకు కూడా కులాల కుళ్లును అంటగట్టిన మనిషి సంకుచిత స్వభావానికి ఎల్లలు లేవేమో!

ఆ మంచంమీద పడుకున్న ఆకారం తలమీద ఒక కాకి రెట్టవేసింది. తరువాత ఇహ తన పని అయిపోయినట్లు రివ్వున ఎక్కడికో లేచివెళ్లింది. రెండో కాకి తుర్రుమంటూ దాన్ని అనుసరించిదరి. అతడు తలపై కాకివేసిన రెట్టను పట్టించుకునే స్థితిలో లేదు. చింతకొమ్మల్లోనుండి దూసుకువస్తున్న సూర్యకిరణాలు చురుక్కుమనిపిస్తున్నాయి. అతడు అటూ ఇటూ అసహనంగా కదిలాడు. ఒంట్లో లేచే ఓపిక లేదు. ఒకవేళ లేచినా, మంచాన్ని పక్కకు జరుపుకునే శక్తి అసలు లేదు. అతడికిప్పుడు ఎవరై



వసంతాలు దాటాయి. దాదాపు నెలరోజులుగా అతడికి చూపు పూర్తిగా తగ్గిపోయింది. కళ్లు మూసినా, తెరిచినా తేడా తెలియడంలేదు. ఎప్పుడూ కళ్లముందు నల్లటి సిల్కు తెర కట్టినట్టు దట్టమైన చీకటి. ఏమీ కనిపించదు. ఆయన అల్లుడు కంటి డాక్టరు. మామగార్ని పరీక్షించి అది గ్లాకోమియా వ్యాధి అని తేల్చాడు. ఆపరేషన్ చేసినా

మూపు రాదు అని నిర్ధారించాడు.

కాలంచేసిన గారడీలో అతడిలా అయిపోయాడు పాపం. ఒకరోజుకు తానిలా అయిపోతానని అప్పట్లో అతడు కల్లోకూడా అనుకోలేదు. కల్లోకూడా అనుకోనిది జరగడమే జీవితం. అందుకే అతడిలా అయిపోయాడు. అతడిపేరు సుబ్బరాజు.

అరవై ఏండ్ల కిందట పెళ్లయిన కొత్తలో ఒకసారి అత్తారింటికి వెళ్లాడు సుబ్బరాజు. ఆ ఊళ్లో శివాలయం ముందు దాదాపు వంద కిలోలు పైబడిన గుండుండేది. సుబ్బరాజును ఆ గుండెత్తమని ప్రోత్సహించారు కొంతమంది కుర్రకారు. ఒకవేళ గుండు ఎత్తలేక చతికిలబడితే, కొత్త పెళ్లికొడుకుని ఎగతాళి చెయ్యాలని వాళ్ల ఉద్దేశ్యం. వాళ్ల ఆలోచన గ్రహించినవాడిలా మొలికమీసం దువ్వుకుని, చిరునవ్వు నవ్వాడు సుబ్బరాజు. కట్టుకున్న గ్లాస్కో పంచెను గోచీ పెట్టి బిగించాడు. చలువ చేసిన మల్లెమొగ్గలాంటి సిల్కు లాల్చీని మోచేతులపైకి మడిచాడు. కిందికి వంగి ఒక్కసారి బాగా దమ్ము తీసుకున్నాడు. గుండును రెండు చేతులమధ్య బిగించి పట్టుకుని, ఒక్క ఊపులో పైకి లేచాడు. ఇప్పుడు గుండు అతని ఎద ఎత్తులో వుంది. అతన్ని ఆ పనికి పురికొల్పిన యువకులు విస్తుపోయి చూడసాగారు. అంతటితో ఆగలేదు సుబ్బరాజు. అలా ఎత్తిన గుండును రొమ్ముకు ఆనించుకుని, ఆలయం చుట్టూ మూడు చక్కర్లు కొట్టి దూది బస్తాను విసిరేసినట్లు నాలుగైదు గజాల దూరం విసిరేశాడు. అదీ సుబ్బరాజు బలం!

ఇహ చెడుగుడు ఆడితే సుబ్బరాజును పట్టే ప్రయత్నం చేయాలంటే ప్రత్యర్థి జట్టు హడలి చచ్చేది. ఆ రోజుల్లో సుబ్బరాజు ఏ జట్టులో వుంటే ఆ జట్టుకే గెలుపు తథ్యంగా వుండేది.

ఆ రోజులు మళ్లీ రావు! ప్చ్! పగలు రేల దాగుడు మూతలాటలతో, అతడి యౌవనం కర్పూర కళికలా కరిగిపోయింది. వృద్ధాప్యం అతడి శరీరంలోకి ఎప్పుడు ప్రవేశించిందో దొంగలా ప్రవేశించింది.

ఒకప్పుడు వంద కిలోల గుండును సునాయాసంగా ఎత్తిన బలశాలి, ఇప్పుడు రెండు కిలోలుకూడా లేని తన కుడిచేతిని ఎత్తలేకపోతున్నాడు. దానికి పక్షవాతం వచ్చింది. అది కదల్లేదు. మెదల్లేదు. ఎప్పుడూ అలా మన్నుతిన్న పాములా పడి వుంటుంది. ఇదివరకు అది చేస్తున్న పనులన్నీ సుబ్బరాజు తన రెండో చేతికి డిప్యూట్ చేయించాడు. మొదట్లో ఇదంతా చాలా అసహ్యంగా, బాధగా, జుగుప్సగా వుండేది. కానీ క్రమేపీ అలవాటయింది.

సుబ్బరాజు ఒకసారి నాలుకతో పెదాల్ని తడుపుకున్నాడు. అతడికి దాహంగా వుంది. “మంచినీళ్లు తీసుకురా” అని కేకేశాడు భార్యని. అయితే అది కేకలా లేదు. ఎక్కడో నూతి అడుగునుండి ఎవరో హీనస్వరంతో మాట్లాడినట్లుంది.

సుబ్బరాజు కంఠం మిసిమి యౌవనంలో ఇలా లేదు. మాట్లాడితే గంట కొట్టినట్టు ఖంగుమని మోగేది. ఎప్పుడైనా కాలక్షేపంకోసం తన ఇంటికి వచ్చేవాళ్లకి రామాయణ, మహాభారతాల్లోని రసవద్ఘట్టాలను కమ్మగా చదివి, అర్థం చెప్పేవాడు. మహాభారతంలో

శాంతిపర్వం, రామాయణంలో సుందరకాండ ఆయనకు ప్రమాణంతో సమానం. శివరాత్రి, శ్రీరామ నవమివంటి ఉత్సవాలు వచ్చినప్పుడు, ఆంజనేయస్వామి గుడివద్ద ఈ కావ్యాల్ని ఎంతో భక్తితో పారాయణం చేసేవాడు సుబ్బరాజు. ఇప్పుడు తన బతుకిలా అయినందుకు నిట్టూర్చాడు సుబ్బరాజు.

"ఇదిగో నీళ్లు" అంటూ మంచినీళ్ల గ్లాసు అందించింది ఆయన భార్య వెంకటమ్మ. రెండుమూడుసార్లు ప్రయత్నించి లేచి కూర్చుని మంచినీళ్లు తాగి ఖాళీ గ్లాసందించాడు ఆమెకు. "అన్నం తింటావా? కందిబేడల పప్పు చేసినా" అందామె. కందిపప్పు ఆయనకు చాలా ఇష్టం. "పొద్దున్నే పెరుగన్నం తిన్నానుకదా? అంత ఆకలిగా లేదు. ఇంకొద్దిసేపాగా తింటాలే" అన్నాడు. ఆమె ఖాళీ గ్లాసు తీసుకుని ఎదురుగా వుండే మిద్దె ఇంటిలోపలికి వెళ్లిపోయింది.

ఇంతలో పోస్ట్‌మాన్ చిన్నబ్బి పోస్టల్ సంచి భుజాన వేసుకుని అక్కడికి వచ్చాడు. "నీ కూతురు రెండొందలు మనియార్డరు పంపించిందయ్యా" అన్నాడు. పోస్టుమాన్ గొంతు విని వెంకటమ్మ అక్కడికి వచ్చింది. చిన్నబ్బి మంచానికి కొంచెం దూరంలో వున్న ఎడ్లబండి వద్దకు వెళ్లాడు. దానికి కుడి పక్కన వరిగడ్డివామి వుంది. చిన్నబ్బి అటూ ఇటూ తారట్లాడి ఒక ఎండు పుల్లను అందుకున్నాడు. బండి ఇరుసువద్ద కందెన్ని దానికి రాశాడు. అప్పటికే మంచంమీద లేచి కూర్చుని వున్నాడు సుబ్బరాజు. పుల్లకు రాసిన కందెన్ని సుబ్బరాజు ఎడమచేతి బొటనవేలికి రాసి, మనియార్డరు ఫారంలో రెండుచోట్ల గుర్తు వేయించుకున్నాడు. తరువాత సంచిలోనుండి వంద నోట్లు రెండు తీసి వెంకటమ్మకు అందించాడు. కంటిచూపు కోల్పోయిన దగ్గర్నుండి అక్షరాస్యుడిగా వుండికూడా బొటనవేలు గుర్తు వేయక తప్పడంలేదు. "ఇంకేమీ ఉత్తరాలు లేవా?"

## బరువైన భార్య



*ప్రపంచం మొత్తంమీద అతి స్థూలకాయురాలైన స్త్రీ కెరోల్ బరువు 495 కిలోలు! కెరోల్‌కు ఓ ప్రియుడున్నాడు. అతని బరువు 45 కిలోలు మాత్రమే! ఆ స్థూలకాయురాల్ని ఒకసారి మంచంమీదనుంచి లేవనెత్తడానికి 12 మంది కావలసివచ్చారు. వారు రెండు గంటల పాటు కష్టపడినతర్వాత, కెరోల్‌ను లేవనెత్తారు. ఆ మధ్య ఆమెగారి బరువును చూడ్డానికి, పశువులను తూకం వేసే యంత్రం కావలసి వచ్చింది. విపరీతమైన లావుగా వుండడంవల్ల కెరోల్ మూత్రపిండాలు సరిగా పనిచేయక శరీరంనుంచి నీరు బయటకు వెలువడడంలేదట!*

— కాడిమెల శ్రీరామమూర్తి

నిరాశగా అడిగాడు సుబ్బరాజు.

ఆ సంగతి చిన్నబ్బికి తెలుసు. "ఇంకేమీ రాలేదయ్యా! వస్తే చాలా పొద్దెక్కింది. పదకొండయినట్టుంది" అని పోస్ట్ బ్యాగ్‌ను భుజానికేసుకుని, బేతాళుని మోసే విక్రమార్కుడిలా ఆకేపాడువైపు బయల్దేరాడు. సుబ్బరాజు నిట్టూర్చాడు. "చూశావా ముగ్గురు కొడుకులుండి, ఒక్కడూ ఒక్క ఉత్తరం రాయడంలేదు. ఇందుకేనా వీళ్లను ఇంత కష్టపడి పెంచింది! చదువులు చెప్పించింది" ఆ ముసలాయన గొంతు దుఃఖంతో బొంగురుపోయింది. "ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో వున్నారు. వాళ్లకెన్ని పనులుంటాయో ఏమో? కూతురు నెలకొకటో రెండో జాబులు రాస్తానే వుందికదా? ఎవరు రాస్తే ఏముంది!" భర్తను ఊరడించే ప్రయత్నం చేసింది ఆమె. కానీ ఆమెకూ తెలుసు కొడుకులు తమనీ వృద్ధాప్యంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని.

ఆ ముసలాయన ఇక మాట్లాడేందుకు శక్తిలేనట్టు మౌనంగా మంచంపై వాలిపోయాడు. వెంకటమ్మ మౌనంగా నిట్టూర్చి డబ్బు తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

సుబ్బరాజు మొదటిభార్య కలరాతో చనిపోయింది. పెళ్లయిన పదిహేను సంవత్సరాలకు ఆమె చనిపోయింది. అప్పటికి ఆమెకు పిల్లలుకూడా లేరు. ఆమె చనిపోయిన మరో ఐదు సంవత్సరాలకు సుబ్బరాజుకు రెండవ పెళ్లి ఆలోచన వచ్చింది. అప్పటికి సుబ్బరాజు నలభై ఏండ్ల వడ్రాయంలో అడుగుపెట్టాడు. మీసాలు అక్కడక్కడా తెల్లబడినాయి. తల పల్చగా నెరిసింది. వెంకటమ్మ వయసు పెళ్లినాటికి పదహారేండ్లు కూడా వుండి వుండదు. సుబ్బరాజుకు పిల్లలంటే అమిత ప్రేమ. పిల్లలకోసమే నడివయసులో రెండో పెళ్లికి సిద్ధపడ్డాడు. వెంకటమ్మకు వరసగా ముగ్గురు కొడుకులు పుట్టారు. ఇక ఆపరేషన్ చేయిద్దామంటే భార్య ఒప్పుకోలేదు. "నాకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. ఈసారి కూతురు పుడితే నా ముచ్చటా తీరుతుంది!" అంది వెంకటమ్మ భర్తతో. ఆమె కోరుకున్నట్టే కుందనపు బొమ్మలాంటి కూతురు పుట్టింది. కొడుకులతో సమానంగా చదువుకుంది. ఓ డాక్టర్‌కి భార్య అయింది. ఇద్దరు పిల్లలకు తల్లి అయింది. అయినా తల్లిదండ్రుల్ని మరిచిపోలేదు. వీలునిబట్టి నెలకో రెండు నెలలకో ఒకసారి ఆ పల్లెటూరికి వచ్చి, తల్లిదండ్రుల్ని చూసిపోతుంటుంది. వాళ్ల ఖర్చులకోసం నెలనెలా రెండొందలో మూడొందలో ఎం.ఓ. చేస్తుంటుంది. బాధ్యత తెలిసిన పిల్ల. ఆ మాత్రం ఇంగిత జ్ఞానం మగపిల్లలకి లేకుండా పోయిందే అన్న సుబ్బరాజు ఆవేదన.

చూస్తుండగానే పొద్దు నడిమింటికి వచ్చింది. వెంకటమ్మ పింగాణీ గిన్నెలో పట్టెడన్నం వేసి, పప్పుతో కలుపుకుని తెచ్చింది. ఆయన ఎడమ చేతిని తానే చిన్నపిల్లాడి చెయ్యి కడిగినట్లు కడిగింది. చెంబు, గ్లాసు పక్కన పెట్టి, అన్నం గిన్నెను ఆయన చేతికి అందించింది. 'భోజ్యేషుమాత' శ్లోకం గుర్తొచ్చి సుబ్బరాజు కళ్లు చెమర్చాయి. పది నిమిషాల్లో అన్నం తినడం ముగించాడు ఆయన. అప్పటికి మంచం సగానికి పైగా ఎండలో వుంది. "లేచి నిలబడు చిన్నగా,


ఎండొచ్చింది. మంచం నీడకు జరుపుతా!'' అనింది వెంకటమ్మ. సుబ్బరాజు లేవడానికి ఇబ్బంది పడుతుంటే భుజం పట్టుకుని లేపింది. ఆయన ముక్కుతూ మూలుగుతూ లేచి నిలబడ్డాడు. మంచం నీడకు జరిపింది. మరో గంటదాకా అక్కడికి ఎండ రాదు. అతని చేతిని శుభ్రంగా కడిగింది. మంచినీళ్లు రెండు గుక్కలు తాగి, మిగిలిన నీళ్లను పారేసి ఖాళీ గ్లాసు ఆమెకు అందించాడు సుబ్బరాజు. ఎంగిలి కంచాన్ని చెంబులో మిగిలిన నీళ్లతో కడిగి ఆమె ఇంట్లోకి వెళ్లింది.

సుబభ్బరాజు తిరిగి ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు. అతడి ఆలోచనలు పరిపరి విధాలా పోతున్నాయి. తన నిస్సహాయతకు తనమీద తనకే జాలివేసింది. కన్న కొడుకులే తన ఊసు పట్టించుకోకపోయినందుకు ఆ ముసలి ప్రాణం తల్లడిల్లిపోయింది. పిల్లల్ని ఎంత గారాబంగా పెంచాడో ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే, అతడి కళ్లల్లో గిర్రున తిరిగాయి నీళ్లు. భయంకరమైన ఒంటరితనం, అతణ్ణే పిచ్చివాణ్ణి చేస్తోంది. పది నిమిషాలు మనసు విప్పి చెప్పుకునేందుకు ఒక 'కొడుకుకూడా దగ్గర లేనందుకు ఆయన మనసు తల్లడిల్లిపోయింది. పిడికెడు ఓదార్పుకోసం ఆయన పరితపించిపోతున్నాడు.

వెయ్యి పున్నమి చంద్రులను చూసిన అనుభవం ఆయనది. వెయ్యి మాసాలు జీవిస్తే పుణ్యం లభించి స్వర్గానికి వెళతారంటారు పెద్దలు. కానీ సుబ్బరాజుకు జీవితం నరక ప్రాయంగా వుంది. అస్థిపంజరపు జైల్లో ఆయనకు తన ఆత్మ జీవిత ఖైదు అనుభవిస్తున్నట్టుంది.

☆ ★ ☆

స్నానపు గదిలో కాలు జారి పడ్డంతో సుబ్బరాజుకు కుడికాలు ఫ్రాక్చరయింది. ఫ్రాక్చర్ అయిన కాలికి పిండికట్టు కట్టారు.



సుబ్బరాజు ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్‌మీద వున్నాడు. ఆసుపత్రికి తీసుకొచ్చి వారం రోజులైంది. రెండు రోజులుగా పరిస్థితి విషమించింది. ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటే, ఆక్సిజన్ సిలిండర్ పెట్టారు. కొడుకులు, కోడళ్లు వంతులవారిగా, తప్పనిసరి తద్దినమన్నట్టు చూసిపోతున్నారు. మొక్కుబడిగా చూసిపోతున్నారు. కట్టుకున్న భార్యమాత్రం అహర్నిశలూ ఆయన్ను కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఆయన ప్రాణం సుడిగాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతోందని తెలిసినా ఆయన్ను కాపాడమని కనిపించని దేవుణ్ణే మూగగా ప్రార్థిస్తోంది.

ఆయన పరిస్థితి క్షణక్షణానికీ క్షీణిస్తోంది. బి.పి టెస్ట్ చేసి పెదవి విరిచాడు డాక్టర్. పక్కన స్టాండ్‌కు తలకిందులుగా వేలాడుతోన్న సెలైన్ బాటిల్‌లోని ద్రవం చుక్కా చుక్క అతని నరాలగుండా ప్రవహిస్తూ, అతని కొనఊపిరులకు ఊపిరులూదాలని విఫలయత్నం చేస్తోంది.

సుబ్బరాజుకు తనచుట్టూ ఎవరెవరున్నారో తెలీదు. అసలు తను ఆసుపత్రిలో బెడ్‌పై ఉన్నట్టు అసలు తెలీదు. తానింకా ఆ పల్లెటూళ్లో చింత చెట్టుకింద పడుకున్నట్టే వుంది. రామాయణంలో సుందరకాండను ఆంజనేయస్వామి గుడి ముందు పందిట్లో కూర్చుని పారాయణం చేస్తున్నట్టే వుంది. శివాలయం ముందు గుండును దూరంగా విసిరేస్తున్నట్టే వుంది.

ఎప్పుడో చనిపోయిన సుబ్బరాజు తల్లి, కొడుకు తలను ఒళ్లో పెట్టుకుని 'దానాయనా! ఎంత అలసిపోయినావు కొడకా! కాసేపు పడుకో!'' అని ఆప్యాయంగా తల నిమిరినట్టే వుంది.

తను తల్లిదగ్గర మళ్లీ శిశువుగా మారి అమ్మ కళ్లల్లోకి చూస్తూ పాలుతాగుతున్నట్టే వుంది. వీధిబడిలో కూర్చుని పలక చేతపట్టుకుని అఆలు దిద్దుతున్నట్టే వుంది. ఇంకా మడిలో మడక కట్టి దున్నినట్లు, బండి తోలినట్లు, కపిలి తోలినట్టు, ఇలా సుబ్బరాజు మనోనేత్రం ముందు చకచకా దృశ్యాలు మారిపోతున్నాయి.

రాత్రి ఎనిమిది గంటలయింది. పెద్ద డాక్టర్ రౌండ్స్‌కి వచ్చాడు. డాక్టర్ని చూసి నిద్రకళ్లతోనే లేచి నిలబడింది వెంకటమ్మ. వారం రోజులుగా నిద్రలేక ఆమె కళ్లు మంకెనపువ్వుల్లా వున్నాయి. పెద్ద డాక్టర్ మౌనంగా సుబ్బరాజు నాడిని పరీక్షించాడు. అతడి ముఖంలో రంగులు మారాయి. పరీక్షించిన చేతిని వదిలేసి "హి ఈజ్ డెడ్!'' అన్నాడు. అలా చెప్పడానికి గిల్టీగా ఫీలయ్యాడు. తన డిగ్రీలు, మందులు ఒక ముసలి ప్రాణాన్ని కాపాడలేకపోయినందుకు నిస్సహాయంగా తలదించుకున్నాడు.

"ఆయన పోయాడమ్మా. ఒక గంటలోపున శవాన్ని తీసుకెళ్లాలి'' నర్సు అల్టిమేటం జారీ చేసింది.

దాదాపు నలభై సంవత్సరాలుగా తనతో కాపురం చేసిన తన జీవిత సహచరుడు ఇహ లేడని తెలిసి వెంకటమ్మ శవంమీద పడి బావురుమని ఏడ్చింది. స్వార్థపరులైన కొడుకుల్ని తలచుకుని భవిష్యత్తుమీద బెంగతో బావురుమని ఏడ్చింది. అనాథలా ఏడ్చింది.

అటెండర్‌కి ఇరవై నోటిచ్చి పెద్ద కొడుకుకు ఇంటి అడ్రస్ చెప్పింది వెంకటమ్మ. హాస్పిటల్‌కి ఫర్లాంగు దూరంలో వుంది అతడి ఇల్లు. ఈ మధ్యే రెండు లక్షలు పెట్టి స్వంత ఇల్లు కట్టుకున్నాడు. తక్కిన ఇద్దరు కొడుకులు, కూతురు, అల్లుడు అంతా రెండురోజులుగా అక్కడే బసచేస్తున్నారు.

అరగంటలో రెండు ఆటోల్లో అంతా హాస్పిటల్ ముందు దిగారు. కాకి శోకాలతో , ఓదార్పులతో మరో పావుగంట గడిచిపోయింది. శవాన్ని ఏమి చేయాలనే ప్రశ్న ఉత్పన్నమైంది. "ఊళ్లో మన మామిడి తోపులోని పెద్ద మామిడి చెట్టుకింద తన సమాధి కట్టించాలని చెప్పేవాడు నాయనా. ఊరికే తీసుకెళ్లాలి" అంది వెంకటమ్మ సన్నగా ఏడుస్తూ.

"రాత్రిపూట. అందులో చావుబేరం. పదిహేను వందలకు తక్కువగా ఏ టాక్సీవాడూ రాదు. అయినా చాదస్తం కాకపోతే చచ్చిపోయాక ఎక్కడ పూడిస్తే ఏముందమ్మా. ఎక్కడ పూడ్చినా ఆయనిప్పుడు చూడొచ్చాడా? ఆ తతంగమేదో ఇక్కడే జరిపిస్తే పోలా? హాస్పిటల్ పక్కనే శ్మశానముంది" అన్నాడు పెద్ద కొడుకు. టాక్సీ ఖర్చు తన నెత్తిన ఎక్కడ పడుతుందోననే ముందు చూపుతో. తక్కిన ఇద్దరు కొడుకులూ మౌనంగా ఏమీ మాట్లాడలేదు. పిల్లలు, నోరు తెరుచుకున్న బెడ్‌మీది తాత శవం వైపు భయం భయంగా చూస్తున్నారు.

వెంకటమ్మకు ఆ క్షణంలో దుఃఖం పొంగుకొచ్చింది. మెడలో పసుపుతాడుకు కట్టిన మంగళసూత్రాలు తప్పితే, ఒంటిమీద తులం బంగారు లేదు. తన భర్త చివరికోరిక తీర్చలేకపోతున్న తన నిస్సహాయతకు, అవధులు లేని కొడుకుల స్వార్థానికి మరొకసారి బావురుమంది వెంకటమ్మ.

అప్పుడు సుబ్బరాజు కూతురు ముందుకు వచ్చి తల్లి భుజంమీద చెయ్యివేసింది. నేనున్నానమ్మా! దిగులుపడకు అన్నట్లు కళ్లతోనే అనునయించింది. తన ఎడంచేతికున్న రెండు బంగారు గాజులు తీసి "ఇవి పెట్టి నాలుగువేలు తీసుకుని రండి" అని భర్త చేతిలో పెట్టింది. వచ్చేటప్పుడు టాక్సీకూడా మాట్లాడుకుని రండి" గుర్తుచేసింది.

☆ ★ ☆